# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

# ప్రాంతీయ వార్తా విభాగం

# ప్రాంతీయ వార్తలు

తేది : 26 -01-2026 సమయం : 6.45 గంటలు

## ముఖ్యాంశాలు

1. **దేశ ఆర్థిక భవిష్యత్ ను తీర్చిదిద్దే ప్రయాణంలో ' ఆత్మ నిర్భరత', 'స్వదేశీ' భావనలే దిక్సూచి అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు.**
2. **జాతీయ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన సత్యం, అహింస, శాంతి, సంఘీభావం వంటి ఉన్నత ఆదర్శాలకు మనమంతా కట్టుబడి ఉండాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు.**
3. **కేంద్ర ప్రభుత్వం వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన అయిదు గురిని పద్మ విభూషణ్**, 13 **మందిని పద్మ భూషణ్**, 113 **మందిని పద్మ శ్రీ పురస్కారాలకు ఎంపిక చేసింది.**
4. **పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు**.
5. **సింగరేణి సంస్థ ద్వారా 25 లక్షల కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి పొందుతున్నాయని కేంద్ర, బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు.**

----------------------

దేశ ఆర్థిక భవిష్యత్ ను తీర్చిదిద్దే ప్రయాణంలో 'ఆత్మ నిర్భరత', 'స్వదేశీ' భావనలే దిక్సూచి అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు. 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రపతి నిన్న  జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. దేశ ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గత సంవత్సరం ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం జరిపిన ఆపరేషన్ సింధూర్' లను రాష్ట్రపతి ప్రత్యేకంగా ప్రస్తావించారు. గణతంత్ర దినోత్సవం అనేది దేశభక్తిని చాటుకోవడానికి  ఒక గొప్ప సందర్భమని ద్రౌపది ముర్ము పేర్కొంటూ...

వాయిస్.. 30 సెకన్లు

-----------------------

ఈ ఏడాది గణతంత్ర వేడుకలను ''వందే మాతరం – 150 సంవత్సరాలు' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు ప్రత్యేక అతిధులుగా యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్  హాజరవుతున్నారు. పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 17  శకటాలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థల నుంచి మరో 13 శకటాలను ప్రదర్శన కోసం ఎంపిక చేశారు.  దాదాపు 2 వేల 500 మంది కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొననున్నారు.   సైన్యానికి చెందిన 18 మార్చింగ్ కంటింజెంట్లు, 13 బ్యాండ్లు పరేడ్‌లో పాల్గొంటాయి. తొలిసారిగా ‘బాటిల్ అరే ఫార్మాట్’ను కూడా సైన్యం ప్రదర్శించనుంది.

-----------------------

జాతీయ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన సత్యం, అహింస, శాంతి, సంఘీభావం, విశ్వ సౌభ్రాతృత్వం వంటి ఉన్నత ఆదర్శాలకు మనమంతా కట్టుబడి ఉండాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఆయన 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గణతంత్ర దినోత్సవం.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకునే రోజు అని, వారి త్యాగాల ఫలితంగా నేడు మనం స్వేచ్ఛా ఫలాలను అనుభవిస్తున్నామని గవర్నర్ పేర్కొన్నారు .

-----------------------

ఆంధ్రప్రదేశ్ లో గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్ర రాజధాని అమరావతిలో తొలిసారిగా నిర్వహించే గణతంత్ర వేడుకలకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు, పలువురు మంత్రులు హాజరుకానున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన.. పోలీసుల బలగాల కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

-----------------------

గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 'పద్మ' పురస్కారాలను ప్రకటించింది. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన అయిదు గురిని పద్మ విభూషణ్, 13 మందిని పద్మ భూషణ్, 113 మందిని పద్మ శ్రీ పురస్కారాలకు ఎంపిక చేసింది. తెలుగు రాష్ట్రాల నుంచి ప్రముఖ క్యాన్సర్ వైద్యులు నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ కు ఎంపిక కాగా కళలు విభాగంలో సినీ నటులు గద్దె బాబూ రాజేంద్ర ప్రసాద్, మాగంటి మురళీ మోహన్, గాయకులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్, నృత్యకారిణి దీపికా రెడ్డి, వైద్య విభాగంలో పాల్కొండ విజయ్ ఆనంద్‌రెడ్డి , గూడూరు వెంకట్రావు, సైన్స్ విభాగంలో డాక్టర్ కుమారస్వామి తంగరాజ్,

గడ్డమనుగు చంద్రమౌళి, సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో కృష్ణమూర్తి బాల సుబ్రహ్మణియన్, సాహిత్యం విభాగంలో వెంపటి కుటుంబ శాస్త్రి పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు. పశుసంవర్ధక, పాడి పరిశ్రమ రంగంలో చేసిన కృషికి గాను మామిడి రామారెడ్డికి మరణానంతరం పద్మశ్రీ పురస్కారం దక్కింది.

----------------------

పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లి నివాసంలో ఆయన పార్లమెంట్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఉత్తరాంధ్ర-రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, పూర్వోదయ పథకంతో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పోలవరం-నల్లమలసాగర్‌లను ప్రాధాన్యాంశాలుగా ప్రస్తావించాలని పార్లమెంట్ సభ్యులకు సూచించారు.

----------------------

సింగరేణి సంస్థ ద్వారా 25 లక్షల కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి పొందుతున్నాయని కేంద్ర, బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణలోని కొత్తగూడెంలో సింగరేణి కార్మికులతో నిన్న ఆయన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సింగరేణి సంస్థకు కేంద్రప్రభుత్వ సహకారం ఉంటుందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి తెలుపుతూ..

వాయిస్.. 30 సెకన్లు

-----------------------

ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం జిల్లాలో నీటి సంరక్షణ కై ప్రజల సహకారంతో వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆ జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన్ కీ బాత్ కార్యక్రమంలో అనంతపురం జిల్లాలో చేపట్టిన అనంత నీటి సంరక్షణ ప్రాజెక్టు గురించి ప్రజలకు తెలియజేయడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం లో ప్రజల సహకారం తో అటవీశాఖ అధికారులు సుమారు 7 వేల కు పైగా మొక్కలు నాటినట్లు జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ వివరిస్తూ..

వాయిస్.. 30 సెకన్లు

-----------------------

అస్సాంలోని గౌహతిలో భారత్, న్యూజిలాండ్ క్రికెట్ జట్ల మధ్య నిన్న జరిగిన టి20 మ్యాచ్ లో భారత జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 153 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం భారత జట్టు ఈ లక్ష్యాన్ని కేవలం రెండు వికెట్లు కోల్పోయి 10 ఓవర్లలోనే ఛేదించింది. దీంతో మరో రెండు మ్యాచ్ లు మిగిలి ఉండగానే టి 20 సిరీస్ భరత్ సొంతమైంది.

-----------------------

ఆంధ్రప్రదేశ్ యానాంలలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని కోస్తాంధ్రప్రదేశ్, రాయలసీమల్లో ఈరోజు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్ర అధికారి పేర్కొన్నారు. రానున్న 4 రోజుల పాటు కనిష్ట ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పులు ఉండవని వెల్లడించారు.

మరోవైపు తెలంగాణలో రానున్న 4 రోజుల పాటు పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాదులోని భాతర వాతావరణ కేంద్రం పేర్కొంది.

-----------------------

గృహ, పారిశ్రామిక, వ్యవసాయ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ రంగాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే కాకుండా ప్రజలపై భారం తగ్గించే విధానాలనే ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. రాబోయే మూడేళ్లలో విద్యుత్ ఛార్జీలను యూనిట్‌పై రూ.1.19 మేర తగ్గించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = =